పురపాలకంలో ప్రణాళిక లేమి!

- జిల్లా కేంద్రంలో ప్రణాళిక విభాగం నిర్వీర్యం
- గత కొన్నినెలలుగా అధికారులు లేకుండానే కొనసాగింపు
- ఇన్‌చార్జిగా సర్వేయర్ నియామకం
- నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా నిర్మాణాలు

నరసరావుపేట: వందేళ్లకుపైగా చరిత్ర కలిగి జిల్లా కేంద్రంగా కొనసాగుతున్న నరసరావుపేట పురపాలక సంస్థలో గత కొన్నిరోజులుగా అధికారులు లేక పట్టణ ప్రణాళికా విభాగం నిర్వీర్యంగా మారింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వార్డు ప్లానర్లు ఉన్నా ఇటువంటి నిర్మాణాలను నియంత్రించలేకపోతున్నారు.. వివరాలను పరిశీలిస్తే.. ఏ గ్రేడు పురపాలక సంఘంగా ఉంటూ 35వేల గృహాలు కల్గి సుమారు 1.09లక్షలమంది ఓటర్లు, 1.40 లక్షలమంది జనాభా కల్గిన నరసరావుపేట పట్టణాన్ని సక్రమమైన మార్గంలో నిర్మాణం చేసేందుకు ప్రభుత్వ ప్యాట్రన్ ప్రకారం ఒక టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ), ఇద్దరు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు (టీపీఎస్)లు పనిచేయాల్సివుంది. వీరికి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలకు చెందిన 34 మంది వార్డు ప్లానర్లు సహాయకులుగా పనిచేయాల్సివుంది.. అయితే గత కొంతకాలంగా టీపీఓ, ఒక టీపీఎస్ మాత్రమే పనిచేస్తుండగా, టీపీఓగా పనిచేసిన నరసింహారావు గుండెపోటుకు గురై మృతిచెందగా గత మూడు నెలలుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది.

ఇన్‌చార్జిలతో కాలం వెల్లబుచ్చుతున్న వైనం...

టీపీఎస్‌గా గత ఏడాదిన్నరగా పనిచేస్తున్న సత్యనారాయణ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో గుంటూరు కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన వెళుతూ ప్రణాళికా విభాగంలో ఏ అధికారి లేకపోవటంతో పట్టణ సర్వేయర్ సాయికుమార్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. నూతన టీపీఓగా గతంలో ఇక్కడ టీపీఎస్‌గా పనిచేసి ఇప్పుడు ప్రకాశం జిల్లాలో టీపీఓగా పనిచేస్తున్న సాంబయ్యను నియమించారు. అయితే అతను బాధ్యతలు స్వీకరించలేదు. స్వీకరించేందుకు కూడా సంసిద్ధంగా లేనట్లు తెలియవచ్చింది. ఇక్కడ ఏడేళ్ల క్రితం టీపీఎస్‌గా పనిచేస్తున్న సమయంలో అప్పటి ముఖ్యనాయకుడు, ఆయన కుమారుడి ఆదేశాలను అనుసరించి అప్పుడు వైఎస్సార్ సీపీలో ఉండి ఇప్పుడు టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఓ నాయకుడి సొంత బాబాయి అపార్టుమెంట్ నిర్మాణాన్ని కూల్చేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సదరు నాయకుడు ఇప్పుడు అధికార పార్టీలో ఉండటంతో తాను టీపీఓగా బాధ్యతలు నిర్వహించటం ఇష్టంలేకనే అతను తన బదిలీని రద్దుచేసుకున్నట్లు తెలియవచ్చింది. దీంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధి సైతం అతను ఇక్కడ టీపీఓగా వచ్చేందుకు అయిష్టతతో ఉన్నట్లు తెలియవచ్చింది. ఆయన స్థానంలో మరెవరిని నియమించకపోవటంతో ఆ స్థానం ఖాళీగా ఉంది.



పురపాలక సంఘ కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగం

ఇష్టానుసారంగా నిర్మాణాలు.. అప్రూవల్స్ ఆలస్యం

గతంలో ఇదే పురపాలకసంఘంలో టీపీఎస్‌గా పనిచేసిన సునీత మళ్లీ నరసరావుపేటకు వస్తున్నారనే ప్రచారం జరిగినా చివరకు ఆమె సత్తెనపల్లి టీపీఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పుడామె డెప్యుటేషన్‌పై నరసరావుపేటకు రానుందనే ప్రచారం ఉద్యోగుల నుంచి విన్పిస్తుంది. ఈ విధంగా ఉద్యోగులు లేక ప్రణాళికా విభాగం ఖాళీగా ఉన్నా ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు పట్టకపోవటం శోచనీయం. పట్టణంలోని అనేక చోట్ల నిబంధనలకు విరుద్ధంగా అతి తక్కువ స్థలంలో నాలుగైదు అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. బిల్డింగ్ మెటీరియల్ రోడ్లపైనే ఉంటోంది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నూతన నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్స్ కూడా ఆలస్యమవుతున్నాయనే వాదన ప్రజల నుంచి విన్పిస్తుంది. కాగా, ఇటీవల ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల సర్దుబాటుకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదిక పంపించే కార్యక్రమాన్ని అధికారులు లేకుండానే సర్వేయరు, వార్డు ప్లానర్లు నిర్వహించాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలుగచేసుకొని ప్రణాళికా విభాగానికి పూర్వవైభవం తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఈ వారం అధికారులు వచ్చే అవకాశం : కమిషనర్

దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును వివరణ కోరగా ఈ వారంలో అధికారులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఆదేశాలను సర్వేయర్, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు నిర్వహిస్తున్నారని అన్నారు. కాగా, టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీస్ (టీపీబీఓ) ఇన్‌చార్జి బాధ్యతలను 1 నుంచి 17వ వార్డులకు నాల్గవ వార్డు ప్లానింగ్ సెక్రటరీ ఎం.ఫణి భరద్వాజ్, 18 నుంచి 34వార్డులకు 26వ వార్డు ప్లానింగ్ సెక్రటరీ షేక్ మౌలాలీలను నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి ప్రతి వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ(డబ్ల్యూపీఆర్ఎస్)లు సహాయ సహకారాలు అందజేయాలని కమిషనర్ ఆదేశించారు.

క్లుప్తంగా

డైమండ్ షోరూం ప్రారంభోత్సవం



నరసరావుపేట రూరల్: కపలవాయి విజయకుమార్ జ్యూయలర్స్ దుకాణంలో స్వా డైమండ్స్ ప్రత్యేక డైమండ్ షోరూం శనివారం ప్రారంభమయింది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సయ్యద్ జిలాని, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన డైమండ్ షోరూం ప్రారంభోత్సవంలో భాగంగా ఈనెల 12 నుంచి 16వ తేదీవరకు ప్రదర్శన, అమ్మకం నిర్వహిస్తున్నట్టు షోరూం నిర్వాహకుడు కపలవాయి విజయకుమార్ తెలిపారు. ఎస్‌డబ్ల్యూఏ డైమండ్స్, వజ్రాభరణాలు, వజ్రహారాలు, పెండెంట్లు, కడియాలు, ఉంగరాలు ప్రదర్శనలో ఉంటాయని వివరించారు. ఈ ప్రాంత ప్రజలు దశాబ్దాల కాలంగా తమ వ్యాపారాన్ని ఆదరిస్తున్నారని, ఇదేవిధంగా డైమాండ్ షోరూం ప్రదర్శన, అమ్మకాలను తిలకించి ఆదరించాలని కోరారు.

ఇస్లాంపేటలో మెగా వైద్యశిబిరం




నరసరావుపేట: పలనాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ ఎంవీ రెడ్డి కంటి వైద్యశాల సౌజన్యంతో ఇస్లాంపేటలోని శ్రీగిరి మున్సిపల్ యూపీ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరంలో 156మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ క్యాంపులో డాక్టర్ సృజన పాల్గొని కంటి వ్యాధులకు సంబంధించి సూచనలు, సలహాలు, ఈ సీజన్‌లో వచ్చే కంటి వ్యాధుల గురించి వివరించి, వారికి కంటి చుక్కల మందులను పంపిణీ చేశారు. అదే విధంగా కొంతమందికి కాంటాక్ట్, కంటి పొరలు, నీటికాసుల సమస్యలను గుర్తించి వారికి తమ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ,, ఇతర అన్ని రకాల హెల్త్ ఇన్స్యూరెన్స్‌ల ద్వారా వర్తించే సేవలను వివరించారు. సీపీఎం నాయకులు విజ్ఞాన కేంద్రం సభ్యులు, కామినేని రామారావు, కట్టా కోటేశ్వరరావు, బండారుపల్లి నాగేశ్వరరావు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కవి కరిముల్లాకు ఘనసత్కారం



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రసిద్ధి కవి కరిముల్లాకు ప్రొద్దుటూరులో ఘన సత్కారం జరిగింది. ప్రతిష్టాత్మక ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును ఆయనకు అందజేసి వక్తలు కొనియాడారు. తెలుగు సాహిత్యంలో కరిముల్లాకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, ఆయన సృష్టించిన అబాబీలు కవితా ప్రక్రియ మహోన్నతంగా ఈ తరం కవులకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. అవార్డు పొందిన కవి కరిముల్లాను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

రెండు ఆలయాల్లో చోరీలు



ఈపూరు: మండలంలోని ఈపూరు, వనికుంట దేవాలయాల్లో శనివారం రాత్రి చోరీలు జరిగాయి. ఈపూరు బోటిమీద ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ముందు తలుపు తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లిన దొంగలు హుండీని పగలగొట్టి అందులోని నగదును దోచుకున్నారు. అలాగే వనికుంట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ముందు తలుపులను విరగ్గొట్టి, తాళాలను పగలగొట్టి లోపల ఉన్న హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును దోచుకెళ్లారు. రెండు దేవాలయాల్లో దొంగతనాలు ఒకేసారి జరగడంతో దొంగలు ఒక ముఠాగా ఏర్పడి చోరీ చేసినట్లు భావిస్తున్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

సత్తెనపల్లి: పేకాట స్థావరంపై పట్టణ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని 28వ వార్డ్ పరిధిలో ఉన్న దోభీ ఘాట్ వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,750 నగదు స్వాధీనం చేసుకున్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

డిమాండ్ చేసిన ప్రజాసంఘాలు, సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: రాజకీయ కారణాలతో విధుల నుంచి తొలగించిన మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ తొలగించిన కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరసన దీక్షలు 12వ రోజుకు చేరాయి. ఈ శిబిరాన్ని పీడీఎం, ఇతర ప్రజాసంఘాల నాయకులు సందర్శించారు. వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఆగిన రెండు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 13 రోజుల నుంచి ధర్నా చేస్తున్నా రాజకీయ నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చొరవ తీసుకోవాలని కోరారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.కృష్ణ, పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, కంబాల ఏడుకొండలు, సీఐటీయూ నాయకులు అల్లాభక్షు, కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికుల దీక్షకు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు

పోలీసులే నిందితులను కాపాడటం సిగ్గుచేటు

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

నరసరావుపేట: లగడపాడు దళితులపై దాడులు చేసిన అగ్రకుల పెత్తందారులపై కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాల్సిన పోలీసు ఉన్నతాధికారులే అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి నిందితులను కాపాడటం సిగ్గుచేటని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గాంధీ పార్క్ ఎదుట ధర్నా కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దళితులపై దాడి చేసిన వారిని ఎస్సీ, ఎస్టీ చట్టం కింద వెంటనే అరెస్టు చేసి, బాధితులపై పెట్టిన తప్పుడు కేసును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 14న కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితులు చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం జిల్లా కమిటీ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో ఆటో రంగం

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ఆటో రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన చేయూత ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ డివిజన్ కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి యూనియన్ డివిజన్ అధ్యక్షుడు నాలి రాజేంద్ర అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ ఆటో కార్మికులు తమ సమస్యలను ఐక్యంగా ఉండి పోరాడి పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.హరిపోతురాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల పరంగా ఇబ్బందులను చర్చించేందుకు ఈ నెల 19, 20 తేదీల్లో నంద్యాలలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు సభ్యులంతా హాజరుకావాలని కోరారు. యూనియన్ డివిజన్ కార్యదర్శి ఏ వెంకట్, కొత్తపల్లి చిన్న మల్లయ్య, నాగేశ్వరరావు, జి.ఇమ్మానియేలు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తి బలవన్మరణం



నాదెండ్ల: కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గణపవరంలోని చవిటిపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చవిటిపాలెంలో నివాసం ఉండే షేక్ జానీ బాషా (46) చిలకలూరిపేటలోని ఓ రైస్‌మిల్లులో కార్మికుడిగా పనిచేస్తుంటాడు. ఈ నెల 11న రాత్రి సమయంలో గడ్డిమందు తాగి పడుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు జానీబాషాను నిద్రలేపేందుకు యత్నించగా అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. భార్య షేక్ రషీదా పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బంగారు నేత్రాలు

అమరావతి: అమరేశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బంగారు నేత్రాలను అమరావతికి కోనూరు దేవిప్రసాద్ కుటుంబ సభ్యులు సమర్పించారు. సుమారు 7 గ్రాముల బరువుతో రూ.60 వేల విలువైన రెండు బంగారు నేత్రాలకు సంప్రోక్షణ నిర్వహించి ఈవో వేమూరి గోపినాథ శర్మకి అప్పగించారు. అర్చకులు శంకర మంచి రాజేష్‌శర్మ, రాజశేఖర శర్మ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు చేసి, నేత్రాలను అలంకరించారు. తొలుత దాతలు అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరిదేవికి పూజలు నిర్వహించారు

ఆర్టీసీ నూతన బస్సులు ప్రారంభం



బస్సులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ డిపోలో ఏర్పాటుచేసిన రెండు నూతన అద్దె బస్సులు, ఒక ప్రభుత్వ బస్సును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శనివారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ డిపో నుంచి మరిన్ని కొత్త బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ప్రయాణికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బస్సులు నడపాలని, ఇబ్బందులు లేకుండా నిత్యం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కూటమి నాయకులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



వినుకొండలో రాజశ్యామల యాగం



బతుకమ్మ అలంకరణ పోటీలో పాల్గొన్న మహిళలు



సత్యసాయి మందిరంలో మహిషాసురమర్దని నృత్యం

వైభవం.. విజయదశమి పర్వదినం

దేవీ శరన్నవరాత్రుల దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. పట్టణంలోని వివిధ ఆలయాలలో అమ్మవారు పదిరోజుల పాటు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలలో చివరిరోజు శనివారం రాజరాజేశ్వరీ అమ్మవారిగా దర్శనమిచ్చా రు. దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఆలయాలలో చండీ హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

– నరసరావుపేట ఈస్ట్, చిలకలూరిపేట, బొల్లాపల్లి, నాదెండ్ల, రొంపిచర్ల, శావల్యాపురం, వినుకొండ



బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో నిర్వహించిన కోలాట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



చిలకలూరిపేటలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



బతుకమ్మ పూజల్లో మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి



సింహవాహనంపై వాసవీమాత నగరోత్సవం



రాజరాజేశ్వరీ అలంకరణలో పార్వతీ అమ్మవారు




రేమిడిచర్లలో పూజలందుకున్న కనకదుర్గాదేవి



యడ్లపాడులో సంతానలక్ష్మీ అలంకారంలో అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు



శావల్యాపురంలో రాజరాజేశ్వరీ అలంకరణ



శాంతినగర్ చలువపందిరిలో రాజరాజేశ్వరి అలంకారంలో..



విప్పర్లలో రాజరాజేశ్వరి అలంకరణలో కామాక్షి అమ్మవారు